# అపార్థం

'వద్దురా బాబూ!' అంటున్న కొద్దీ నన్ను అరవ సినిమాకు లాక్కెళ్ళాడు గిరి. చాలా ఏళ్ళుగా అరవదేశంలో ఉంటున్నా నాకు అరవ భాష రాదు; అరవ సినిమాలు అర్థం కావు.

'ఈ సినిమా తీసినవాడు మన తెలుగువాడే. త్వరలోనే అరవ ప్రొడ్యూసరు – డైరెక్టరుగా పైకి వచ్చాడు. ఇతను ఇంతకుముందు తీసిన పిక్చరొకటి బెంగుళూరులో చూశాను. భలే బాగుంది. మరీ వీరాంధ్రత్వం పోకు, ఎక్కడన్నా డయిలాగర్థం కాకపోతే నేను చెబుతాలే!' అని నా అభ్యంతరాల నన్నిటినీ తోసేసి నన్నా అరవ సినిమాకు తీసికెళ్ళాడు గిరి.

నేను సినిమా చూడటానికి బయలుదేరినాక గూడా గిరి, మేం చూడబోయే పిక్చరు గురించి కాన్వాసింగు మానలేదు. 'ఈ పిక్చరు మూడు నెలల్లో పూర్తి అయింది. నీకు తెలుసా? ఇరవై ఎనిమిది కాల్‌షీట్లు. నేనేమనుకున్నానో అన్నట్టు 'ఇందులో కథానాయిక పాత్ర ధరిస్తున్నది తెలుగు తార, నీ కింకా తెలీదేమో!'

గిరి నాకు కేవలం స్నేహితుడే కాదు, బంధువు కూడానూ. దూరపు బంధువు కూడా కాదు. 'ఒంటె లిడిచిన' తమ్ముడు, (పాత కాలపు జోక్‌లెండి.) అదీ గాక వాడు నాలుగేళ్ళ అనంతరం కనబడ్డాడు. అందుకని, వాడికి తృప్తిగా ఉంటుందిగదా అని, వాడు చెప్పేదానికి సమయోచితంగా, 'ఓహో?', 'అట్టాగా?', 'చెప్పవేఁ మరీ?' అంటూ ప్రోత్సాహం ఇచ్చాను.

పిక్చరు చాలా ప్రజాదరణ పొందుతున్నట్టు హాలు దగ్గరి పెద్ద పెద్ద క్యూలు చెప్పక చెప్పాయి. (ఇది పాత నుడికారమే). రిస్కు తీసుకోవటం ఇష్టం లేక గిరి, కాస్త పై క్లాసు టిక్కెట్టు కొనేశాడు.

లోపలికి వెళ్ళి కూర్చున్నాం. పిక్చరు ఆరంభమయ్యింది. గిరి చేసిన కాన్వాసింగుకన్నా పిక్చరే నన్ను హెచ్చుగా నమ్మించింది. డయిలాగులు 'ఎన్నా', 'ఆమ', 'సొల్లు' లాంటి ఏడెనిమిది మాటలు మించి నాకు అర్థం కాకపోయినా కథ స్థూలంగా బోధపడుతూనే ఉన్నది. మొత్తానికి గిరి పిక్చరులో డయిలాగులు తర్జుమా చేసి చెప్పలేదు. నాకు

చెప్పించుకోవాలని తట్టను కూడా లేదు. నిజం చెప్పాలంటే నేను వాడి సంగతి పూర్తిగా మరిచే పోయాను.

వాడే నాకు తనను తాను జ్ఞాపకం చేసుకున్నాడు. నన్ను చెయ్యి పట్టి గుంజుతూ నా కిష్టం లేని పని ఏదో చెయ్యమంటున్నాడు.

'ఏమిటీ?' అన్నాను పరధ్యానంగా.

'పోదాం పద!' అన్నాడు వాడు పళ్ళు బిగబట్టి.

'ఎక్కడికి?' అన్నాను అయోమయంగా, తెర మీద తెలుగు తార అందంగా ఏడుస్తున్నది. నా కళ్ళు తెర మీదినుంచి పక్కనున్న గిరి మీదికి తిరగ నిరాకరిస్తున్నాయి.

'ఈ సినిమా భరించలేను. నువు రాకపోతే నేను పోతాను!' అన్నాడు గిరి. ఈ సారి వాడి గొంతులో ఏడుపు ధ్వనించింది.

చుట్టుపక్కల వాళ్ళు మాకేసి చూస్తున్నట్టు నా దివ్యదృష్టికి తెలుస్తున్నది. ఒక చెంప గిరి మీద మండిపోతున్నది. వెధవ! ఏడుపు ఘట్టాలు చూడలేనివాడు సినిమాకెందుకు రావాలీ? ఏడుపులూ, పెడబొబ్బలూ లేకపోతే సినిమా ఎలా అవుతుందీ? ఇంకా నయం కదా, ఈ సినిమాలో ఏడుపులు తప్ప పెడబొబ్బలు లేవు. పిక్చర్లో శివాజి గణేశన్ ఉంటే గిరి గాడి ధణుతు లెగిరిపోయి ఉండును.

గత్యంతరం లేదు. సీటులోంచి లేచి గిరి వెంట బయటికి బయలు దేరాను. ఆఖరుసారి హీరోయిన్‌కు గుడ్‌బై చెబుదామని స్క్రీన్ కేసి తిరిగితే, అక్కడ హీరోయిన్ లేదు. ఇంకెవరెవరో ఉన్నారు.

హాలునుంచి బయటికి వచ్చేదాకా గిరి మీద నాకు కోపంగానే ఉందిగానీ, బయటికి వచ్చాక వాడి మొహం చూస్తే నాకు భయం వేసింది. వాడు ఏ నాజీ కాన్సెంట్రేషన్ కాంపు నుంచో బయటపడిన యూదుజాతి వాడిలాగా అయిపోయాడు.

వెంటనే నేను సినిమా మాటే మరిచిపోయి వాణ్ణి గురించి ఆరా తీశాను. 'ఏమయింది? సినిమా బాగాలేదా? బాగానే ఉన్నట్టుందే! ఎందుకంత గండ కత్తెరగా బయటికొచ్చేశాం?'

'అంతా సావకాశంగా చెబుతాను. నన్ను కాస్త తేరుకోనీ.... బీచికి పోదాం పద! ఊరు మధ్య నాకు ఉక్కిరి బిక్కిరిగా ఉంది!' అన్నాడు గిరి.

నేనప్పుడే అనుకున్నాను, ఏదో కథ వుందని. ఆ మాట నిజమే. అది వాడి కథే కూడాను. బీచిలో నాకంతాచెప్పేశాడు. కాని వాడు చెప్పినట్టుగానే చెబితే అది రెండు గంటల పైన పట్టుతుంది. (అదీ గాక వాడు నా కా కథను ఎట్లా చెప్పాడో అక్షరాలా నాకు

జ్ఞాపకం కూడా లేదు.) అందుచేత నేను వాడే చెబుతున్నట్టు మిమ్మల్ని నమ్మిస్తూ నా సొంత మాటలలోనే ఆ కథ చెబుతాను.

సినిమా కథలు జీవితంలా ఉండవని అందరూ ఆక్షేపిస్తారు. ఈ ఒక్కసారికి జీవితం సినిమాలాగా ఉండనందుకు నేను చాలా బాధ పడుతున్నాను. మనం చూసిన ఈ సినిమా – అదేలే సగం చూసినది – నా జీవితంమీద పేరడీ మోస్తరుగా ఉంది... తొందర పడకు, మెల్లగా అంతా చెబుతాను.

నువ్వు రత్నాన్ని ఎరుగుదువా? ఎరగవు. కాలేజీలో, ఇద్దరమూ నాలుగేళ్లు కలిసి చదివాం. అటువంటి స్నేహితుడందరికీ దొరకడు. పెట్టి పుట్టాలి. ఎంత విశాల హృదయం అతనిది! శాపం చేత మానవ జన్మ ఎత్తిన దేవత అన్నట్టుండే వాడు.

రుణం, రుణపడి ఉండడం అనే మాటలను నాలుక చివరినించి ఉచ్చరిస్తాం. నేను నీకు డబ్బు బాకీ వుంటే, ఎన్ని సంవత్సరాల తరవాత నా బాకీ వడ్డీతో సహా ఎంత అయేదీ లెక్కలుకట్టేటందుకున్నది. నువు నాలో వుండే కుళ్ళంతా కడిగి, నాలో మానవత్వం పెంపొందిస్తే ఆ బాకీ ఎంతో ఎవడు చెబుతాడు? నేను రత్నం దగ్గిర వందలకొద్దీ విషయాలు నేర్చుకున్నాను. నేనతనికి ఉత్త స్నేహితుణ్ణి కాను – చిత్తశుద్ధిగా చెబుతున్నాను – శిష్యుణ్ణి, భక్తుణ్ణి. అతనిలో లోపాలు ఎన్నినందుకు నాకెవరన్నా డబ్బిస్తామంటే నేను వాళ్ళనుంచి ఎఱ్ఱని ఏగానీ సంపాదించలేదు. అతను చచ్చిపోయాడని తెగపొగడుతున్నాననుకోకు.

అవును, అతను పోయాడు. రెండేళ్ళయింది. ఆ విషయానికి తరవాత వస్తాను.

కాలేజీ చదువు ముగిసిన కొద్దిరోజులకే అతనికి పెళ్ళయింది. పెళ్ళికి నన్నాహ్వానించాడు. అతని పెళ్ళికి నేను టైఫాయిడ్ జ్వరంతో తీసుకుంటున్నాను. ఆ తరవాత నేను సిమ్‌సన్ కంపెనీలో చేరి పట్నం వచ్చేశాను. రత్నం టీచరు ట్రెయినింగుకు వెళ్ళాడు.

మా ఇద్దరికీ మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతూనే వచ్చాయి. అతను తరుచు భార్యగురించి చాలా మంచిగా ఒకటి రెండు వాక్యాలు రాస్తుండేవాడు. ఆవిడ పేరు రుక్మిణి. తన భార్య అంటే తనకు వల్లమాలిన అపేక్ష ఉన్నట్టు రత్నం చెప్పకపోయినా, అతనికి తన జీవితంలో భార్య ఒక ముఖ్య విషయం అయినట్టు నాకు తెలిసిపోయింది. రత్నం వంటివాడు ఎంతో ప్రేమించకపోతే తన భార్య గురించి అంత శ్రద్ధ కనబరచడు... రుక్మిణి గురించి నాకు చాలా మంచి అభిప్రాయం ఏర్పడింది.

ప్రేమికులను లోకం ప్రేమిస్తుందనేమాట అబద్ధం కాదు. మనని ప్రేమించినవాళ్ళను కూడా మనం కొంతకాలమే ప్రేమించగలం. కాని లైలాను లోకం శతాబ్దాల తరబడి ప్రేమిస్తుంది. నాకు రుక్మిణిపట్ల క్రమంగా అటువంటి ప్రేమ కలిగింది. అందులో స్వార్థం ఏమీలేదు. అసూయ అంతకన్నా లేదు.

రత్నానికి సరి అయిన ఉద్యోగం దొరకలేదు. రెండు మూడు చోట్ల పనిచేసి, ఎందుకో మానేశాడు. అధికార దౌష్ట్యం అంతకంతకూ దేశంలో పెచ్చరిల్లిపోతున్నదని అతను ఒక ఉత్తరంలో రాశాడు.

అతను డబ్బుకు ఇబ్బంది పడుతున్నట్టుతోచి ఒకసారి రెండు వందలు పంపాను. ఒంటరిగాణ్ణి. జీతం బాగానే వస్తున్నది. అతను డబ్బుకు చిక్కుపడుతుంటే నేను బాంకు ఎకౌంటు ఎట్లా పెంచుకోను?

'డబ్బు పంపావు. బాకీ ఎట్లా తీరుస్తాననుకున్నావు?' అని అతను రాశాడు. నేను బ్రహ్మాండమైన ఉత్తరం రాశాను. నేను జన్మరాహిత్యం కోరుకోవటం లేదనీ, నాకిష్టమైన వాళ్ళకోసం కోటి జన్మలెత్తటానికైనా నాకభ్యంతరం లేదనీ, అందరినీ విడిచి పుచ్చి పరమాత్మలో ఐక్యం కావటంకన్న పచ్చి స్వార్థం ఉండదనీ, నా బాకీ ఈ జన్మలో తీరకపోతే వచ్చే జన్మలో తీర్చటానికి నాకభ్యంతరం ఏమీలేదనీ, వచ్చే జన్మ సంబంధం గ్యారంటీ చేసుకోవటానికి అతనికింకా అప్పు పెడతాననీ ఏమేమిటో రాశాను. అదొక విధమైన ప్రేమలేఖ అనుకో. నా జన్మలో మొదటిసారీ, చివరిసారీ రాసిన ప్రేమలేఖ. ప్రపంచంలో ఏ ఆడదానికీ అటువంటి ఉత్తరం రాసి ఉండను. అది పోనీ.

నా మాదిరి అప్పులవాణ్ణి భరించటం కన్నా తనకు ఆనందం మరి ఉండదని అతను జవాబిచ్చాడు.

తరవాత నాలుగైదు నెలలకు రత్నం తనకు జబ్బుగా ఉన్నట్టు ఉత్తరం రాశాడు. జబ్బేమిటో రాయలేదు. నేను మళ్ళీ అతనికి డబ్బు పంపుతూ, శ్రద్ధగా వైద్యం చేయించుకోమన్నాను.

డబ్బు అందినట్టు రాస్తూ అతను, 'నా జబ్బు నయమవుతుందని తోచదు. వారాలు కాకపోతే, నెలలో ఉంది నా చావు. శలవు దొరికితే ఒకసారి రా' అని రాశాడు.

నేను వెంటనే శలవు సంపాదించి, ఒంగోల్లో రత్నాన్ని చూడబోయాను. అతను చాలా బీద స్థితిలో ఉన్నాడు. నాకు పూరిపాకలూ, మట్టి నేలలూ, కుక్కి మంచాలూ అంటే భయంలేదు. పూరిపాకల్లో కూడా బోలెడంత మనశ్శాంతి లభిస్తుంది. ఒక్కోసారి మిద్దెల్లోనూ, మేడల్లోనూ లభించని మనశ్శాంతి ఆ పూరి యిళ్ళలో లభిస్తుంది. కాని రత్నం ఉంటున్న ఇంటినీ ఆ ఇంట్లో రత్నాన్నీ చూడగానే నాకు భయం వేసింది. అంత అనారోగ్యస్థితిలో ఉన్నవాడు అటువంటి వాతావరణంలో ఉండరాదు.

రత్నాన్ని చూసి నేను గుర్తించలేకపోయినానంటే నమ్ము. నేను ప్రేమించి, అభిమానించే రత్నం ఇతను కాదనిపించింది. అది రోగిపట్ల ఆరోగ్య వంతుడికి కలిగే విముఖత్వం. దాన్ని నేను త్వరలోనే జయించాను.

'ఎట్లా వున్నావు రత్నం?' అన్నాను చూస్తూనే.

'ఇదుగో, ఇట్లా ఉన్నాను.'

'ఏమిటి జబ్బు?'

'కిడ్నీల వ్యాధి అన్నాడు డాక్టరు.'

'ముందు నువు ఈ ఇల్లుమారు' అన్నాను. చుట్టూ కలయచూసి చీదరించుకుంటూ.

రత్నం బలహీనంగా నవ్వి, 'చావటానికిది తగిన చోటు కాదంటావా?' అన్నాడు.

'జబ్బు మనిషి బతకటాని కీ చోటు మంచిదికాదు' అన్నాను. నేనప్పటి కప్పుడే ఊరిమీద పడి ఒక డాబాయిల్లు అద్దెకు తీసుకుని, తిరిగొచ్చి రత్నాన్ని అక్కడికి మార్చే ప్రయత్నం చేశాను.

దేవుడి పాత్ర ధరించటంలో ఎంత ఆనందం ఉందిరా, ఒరే! రత్నాన్ని ఆదుకోవటంలో నేను స్నేహధర్మం మాత్రమే పాటిస్తున్నానని నాకనిపించలేదు. ఏదో అనిర్వచనీయానందం! సృష్టిలో ఉండే వంకలన్నిటినీ సరిచేస్తున్నంత తృప్తి! వాడెవడో చచ్చిపోయిన తన భార్యను తన ఆయుర్దాయంలో సగమిచ్చి బతికించుకుంటాడు చూడూ. వాడు కూడా ఇంత ఆనందం పొంది ఉండడు. నేను రత్నానికి ఆయుర్దాయమేకాక, కొత్త జీవితం ఇస్తున్నంతగా గర్వపడ్డాను. నా ఆనందానికి ఆధారభూతం నా జేబులో ఉండే నూరు రూపాయల నోట్లే నన్నది నాకా సమయంలో తట్టలేదు.

రత్నం మొదట్లో బలహీనంగా అభ్యంతరం చెప్పాడు కాని, తరవాత నేను ఏం చేసినా, సరే నన్నాడు.

రత్నాన్ని ఇల్లు మార్చేటప్పుడు రుక్మిణిని పరీక్షగా చూశాను. మనిషి ప్రత్యేకించి గొప్ప బ్యూటీ అని చెప్పలేనుగాని, చూడగానే స్నేహభావం కలిగే మనిషే. నేను తమను ఆదుకుంటున్నానన్న సంతోషం రత్నం మొహంలో నాకంతగా కనిపించలేదు గాని, రుక్మిణి మొహంలో స్పష్టంగా కనిపించింది.

'మీరు దేవుడల్లే వచ్చారు' అని రెండుసార్లయినా ఆమె అన్నది.

అల్లాదీన్ లాంతరులాగా నేను చెంబులూ, తప్పాలాలూ, కూరలూ, బుట్టలూ అన్నీ తెచ్చిపడేశాను. డాక్టరును పిలుచుకొచ్చి 'డాక్టర్, మీరు డబ్బుకు వెనకాడవద్దు. ఎంత ఖర్చయినా సరే, రత్నానికి నయం చెయ్యండి' అన్నాను.

డాక్టరు నాకేసి కొంచెం రోతగా చూసి, 'కొన్ని రోగాలకు డబ్బంటే ఖాతరుండదు సార్' అన్నాడు ఇంగ్లీషులో.

డాక్టరామాట అనటంతో నాలో అంతదాకా ఉన్న ఆత్మ విశ్వాసం దెబ్బ తిన్నది. అప్పటిదాకా రత్నాన్ని నేను బతికించుకోగలననే ధైర్యం నాకు పూర్తిగా ఉన్నది. కాని

ఇప్పుడు రత్నం బతకడేమోనన్న సందేహం నన్ను బాధించసాగింది. అతని వంటివాడు నిరర్థకంగా పోవలసిందే? ఎంత దారుణం!

అతన్ని బతికించుకోగలనన్న ధైర్యం నాలో పూర్తిగా ఉన్నప్పుడే, అంటే అతన్ని చూసిన అయిదు నిమిషాల్లోనే, 'నువు పోవటం ఎంత నష్టమో ఆలోచించు' అన్నాను.

రత్నం ఆశ్చర్యంగా, 'ఎవరికి?' అన్నాడు. తరవాత అతను 'అదృష్టవశాన నేను లంపటం పెంచుకోలేదు. నాచావు ఎవరికీ సమస్యకాదు. రుక్మిణికి తప్ప. రుక్మిణికిది నిజంగా సమస్యే. పుట్టింటివాళ్ళు కూడా ఎవరూ లేరు. ఒక్క పినతండ్రి ఉన్నాడు. అదో రకం మనిషి. బతికుండి నా జీవితాన్నే ప్లాను ప్రకారం నడపలేకపోయాను. నా అనంతరం రుక్మిణి జీవితానికి ప్లాను వెయ్యటం నా తరమా?' అన్నాడు.

అతను బతకడేమోనన్న అనుమానం సీరియస్‌గా నా మనసులో ప్రవేశించగానే నాకు రుక్మిణి గురించి ఆలోచన వచ్చింది. రత్నాన్ని బతికించుకోలేకపోతే, రుక్మిణి సమస్యను పరిష్కరించటానికైనా సమర్థుణ్ణి కాలేకపోతానా?

నా కనీస స్నేహ ధర్మం రుక్మిణిని పెళ్ళాడటం అనిపించింది. మొగుడు పోయాక పిల్లలు కూడా లేని దానికి భవిష్యత్తు ఏమున్నది? జీవితంలో సహారా అంటూ ఉండదు. నే నామె ప్రేమను సంపాదించాలని ఆశించలేదు. ఆమె రత్నాన్ని ప్రేమించి ఉండాలి. కనీసం అతని స్మృతిని ఇద్దరమూ పంచుకోగలం. అంతకంటె మా మధ్య దృఢమైన బంధం ఏం కావాలి? రత్నాన్ని తన మనసులోనైనా నాలుగు కాలాలపాటు సజీవంగా ఉంచుకోదలిస్తే రుక్మిణికి నా కన్న మంచి స్నేహితుడెవరు దొరుకుతారు?

రుక్మిణి కోసమే నేనింత కాలమూ పెళ్ళిని తప్పించుకు తిరిగానేమోనని కూడా నాకనిపించింది. ఒక చిన్న మూఢ విశ్వాసమనుకో.

రత్నం బతికి ఉండగానే అతని భార్యతో కాపరం చేసే పథకం వేస్తున్నందుకు సిగ్గు కూడా వేసింది. కాని నే నా పథకం వెయ్యటంలో సుఖాపేక్ష ఏమీలేదు. ప్రమాణం చెయ్యగలను.

ఏమైనా నేను చేసిన ఆలోచనలు దూర భవిష్యత్తుకు సంబంధించినవి కావు. ఇల్లు మారిన రాత్రి పది గంటలకే రత్నం కండిషన్ సీరియస్‌గా పరిణమించింది. ఇల్లు మారినాక అతన్నీ, రుక్మిణినీ చూడ వచ్చిన ఇద్దరు ముగ్గురిలో ఒక వయసు మళ్ళినావిడ 'చూస్తూ చూస్తూ నవమి ఘడియల్లో ఇల్లు మార్చారేం తల్లీ? రేపటిదాకా ఆగితే దశమి వచ్చేదిగా?' అన్నది. అప్పట్లో నేనా మాట లక్ష్యపెట్టలేదు గాని రత్నానికి సీరియస్ కాగానే ఆ మాట జ్ఞాపకం వచ్చి, మనసు కలుక్కుమన్నది. మనం అచ్చగా మన మూఢ విశ్వాసాలతోనే బాధ పడతామనుకోవటం పొరపాటు. సమాజానికుండేవి మనని బాధించకుండా ఉండవు.

డాక్టరు వచ్చాడు. ఏమీ మాటాడలేదు. ఏదో ఇంజెక్షను ఇచ్చాడు– ఔషధ దేవతల సంతృప్తికోసం. తెల్లవారు జామున నాలుగు గంటల వేళ రత్నం ప్రాణాలు వదిలేదాకా తాను కూడా, పాపం, మా వెంట మేలుకొని ఉన్నాడు.

రత్నం పోయాక రుక్మిణి శవం మీద పడి బావురుమని ఏడవక, ఒక మూల చేరి కుళ్ళి కుళ్ళి ఏడిచింది. నేను చాలా బాధపడ్డాను.

రుక్మిణి పినతండ్రికి టెలిగ్రాం ఇచ్చాను. మర్నాడు మధ్యాహ్నం శవ దహనం అయాక ఆయన వచ్చాడు. ఆయన యాభై ఏళ్ళవాడు. చాలా మంచివాడుగా కనబడ్డాడు.

'మేం మూడు తరాలుగా దరిద్రులం. రుక్మిణి దరిద్రుల మధ్య పుట్టి మళ్ళీ దరిద్రుణ్ణే పెళ్ళాడింది. దాని జాతకం! జాతక రీత్యా దాని జీవితం అలా వెళ్ళిపోవలసిందే' అన్నాడాయన.

ఆ చివరి ముక్కలో నాకు నమ్మకం లేదు. అయినా నే నేమీ మాట్లాడలేదు. కాని ఇక జరగవలసిందేమిటని ఆయనను అడిగాను.

'అదే ఆలోచిస్తున్నాను. కర్మ ఇక్కడ చెయ్యటమా, మా వూళ్ళో చెయ్యటమా అని ఆలోచిస్తున్నాను' అన్నాడాయన.

నేను షాక్ తిన్నాను. రత్నానికి కర్మ చేస్తారా? అతనికి అటువంటి వాటిలో ఏమీ నమ్మకం లేదు. అతనికి జంఝం లేదు. అతనెన్నడూ తద్దినాలు పెట్టలేదు. ఆ మాటే ఆయనతో అనేశాను.

'నాయనా, ఈ కర్మకాండంతా బతికున్న వాళ్ళదిగాని, చచ్చిపోయిన వాళ్ళది కాదు. రత్నానికి జంఝప్పోగులేకపోతే ఏమయింది? నాకున్నది గదా. నేను శ్రాద్ధాలు పెడుతూనే ఉన్నాను గదా? రత్నం కోసం నా విధి నేను మార్చుకునేదా? నువ్వే చెప్పు!' అన్నాడాయన.

ఆయన వాదం సరయినదే కావచ్చుగాని, రత్నానికి ఉత్తర క్రియలు జరపడంలో ఏదో అపహాస్యం ఉన్నదన్న భావం నన్ను బాధించింది.

'అయితే కర్మ ఇక్కడే చేస్తారా? చేసేటట్టయితే నేను కూడా అన్నాళ్లూ ఉంటాను' అన్నాను.

'ఇక్కడ దేనికి, చిన్నాన్నా? ఈ పాపిష్టి ఇంటి నుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిది. విషపు ఘడియల్లో ఇందులో అడుగు పెట్టాం' అన్నది రుక్మిణి.

నన్నామె చెప్పుతో కొట్టినా అంత బాధపడి ఉండను. ఆ ముసలావిడ నవమి ఘడియలను గురించి చేసిన ఆక్షేపణను రుక్మిణి సీరియస్‌గా తీసుకున్నదా? రత్నం భార్య ఇట్లా మాట్లాడుతుందా? నాకామె చాలా కొత్తగా కనిపించింది.

బాధలో మనుషులు డిమోరలైజయి మాట్లాడతారు. రుక్మిణి కూడా భర్త పోయిన దుఃఖంలో అట్లా అని ఉంటుందని మనసును సమాధానపరుచుకున్నాను.

'పోనీ, అలా అయితే, రేపే సంచయనం చేసి, అస్థికలు పట్టుకుని వూరికి రైలెక్కుదాం' అన్నాడు చిన్నాన్న.

రత్నం కర్మ నిమిత్తమై కొంత డబ్బు ఆయన చేతిలో పెట్టాను. తీసుకున్నాడు. ఆయన రత్నానికి కర్మ చేస్తానంటే అది నాకు విపరీతంగా తోచిందిగాని, ఆ కర్మకయే ఖర్చు నేనివ్వటం నాకు విపరీతంగా తోచలేదు.

రత్నం పోయిన నాలుగోనాడు ఇల్లు ఖాళీ చేసి వాళ్ళను రైలెక్కించి, నేను కూడా రైలెక్కి, ఇక్కడికి వచ్చి, ఇక్కడి నుంచి బెంగుళూరు వెళ్ళి పోయాను. రుక్మిణి భవిష్యత్తు గురించి నా మనసులో అనుకున్న ఏర్పాటు విషయం ఆమెకు చెప్పలేదు. అప్పుడే ఎట్లా చెప్పటం?

కాని ఆ ఆలోచన అహోరాత్రులూ నన్ను వెంటాడుతూనే ఉన్నది. రుక్మిణికి నా జీవితంలో ఆశ్రయమివ్వటం నా కనీస ధర్మమన్న అభిప్రాయం నానాటికీ నాలో పెరిగి రాక్షస ప్రమాణాల నందుకున్నది. ఒక్కొక్కప్పుడు చాలా చిరాకేసేది. ఎవరి మెప్పుకోసం, దేనిగ్గాను భయపడి, నా జీవితాన్నీ, రుక్మిణి జీవితాన్నీ వృథా పోనిస్తున్నాను? ఈ క్షణమే వెళ్ళి నేను రుక్మిణిని ఎందుకు పెళ్ళాడరాదు? ఇద్దరమూ రత్నాన్ని మరిచిపోయాక మా పెళ్ళి జరిగితేనేం? జరక్కపోతేనేం? ఇట్లా వేదన పడేవాణ్ణి.

ఒక్క నెల రోజులు పోనిచ్చి, రుక్మిణికి ఒక ఉత్తరం రాశాను. ఆ ఉత్తరంలో రెండే రెండు ముక్కలు రాశాను – నేను రత్నానికి సహాయం చెయ్యటంలో తెలియక ఏదైనా పొరపాట్లు చేసి ఉంటే క్షమించమనీ, నా వల్ల ఎలాంటి సహాయం కావలసి ఉన్నా నిస్సంకోచంగా నాకు రాయమనీనూ. నవమి ఘడియల్లో – రుక్మిణి అన్నట్టు, విషపు ఘడియల్లో – ఇల్లు మార్చానన్నది నా మనసులో ఇంకా మెదులుతూనే ఉంది.

ఈ ఉత్తరం రాయటానికే నాకు చెయ్యి వణికింది, ముచ్చెమటలు పోశాయి. నన్ను కంపింపజేసినది రాసిన మాటలు కాదు, రాయనివి.

ఉత్తరానికి జవాబు లేదు. 'చిన్నాన్న' ఇచ్చిన అడ్రసు సరిగానే ఉన్నట్టు కనబడింది. ఉత్తరం అందకపోవటానికి కారణం కనబడలేదు. నాకు చాలా కష్టం వేసింది. నేను చేసినదానికి లాంఛన ప్రాయంగానైనా రుక్మిణి కృతజ్ఞత తెలుపుతూ ఉత్తరం రాసి ఉండవచ్చు. కనీసం 'చిన్నాన్న' చేత రాయించి ఉండవచ్చు. నా అడ్రసు ఆవిడకి తెలుసు. రత్నం రాసిన ఆఖరు ఉత్తరంమీద అడ్రసు రాసినది రుక్మిణే. అదేమీ లేకపోగా నేను రాసిన ఉత్తరానికైనా సమాధానం లేదు. నే నామెకు అంత ద్రోహం ఏం చేశానో అర్థం కాలేదు.

చెయ్యదలచిన పనికి విఘ్నాలు కలుగుతుంటే ఆరాటం జాస్తి కావటం సహజమే గదా. రుక్మిణిని పెళ్ళి చేసుకోవాలన్న అభిప్రాయంలో నాకున్న కాస్త ఆనందమూ

ఇంకిపోతున్నా, చేసుకోవాలన్న ఆరాటం జాస్తి అయింది. రోజులు గడిచేకొద్దీ అది మింగవలసిన చేదు మాత్రగా అయింది. అసలు విషయం ఆమెకు రాద్దామన్న ప్రేరణ ఎన్ని వందలసార్లు కలిగిందో! ఎన్ని వందలసార్లు 'ఎందుకొచ్చిన పీడ? ఆ రుక్మిణి ఏమైతే నాకేం?' అనుకుని, మళ్ళీ పశ్చాత్తాప పడ్డానో చెప్పలేను. నా మనసును ఇలా ఉద్రూత లూగించిన శక్తులకు ఒక స్వరూపం లేదనిపించింది.

ఇట్లాగే ఒక సంవత్సరం గడిచింది. ఆఖరుకు తెగబడి, నాలోనేను హోరా హోరి పోట్లాడి, నాలో వున్న ధైర్యాన్నంతా కూడగట్టుకొని, ఒక దుర్ముహూర్తంలో రుక్మిణి ఉండే ఊరికి టిక్కెట్టు కొని బయలుదేరాను. భయంకరంగా పేలే ఫిరంగులకు ఎదురు వెళ్ళే సైనికుడికి కూడా అంత ధైర్యం అవసరముండదేమో ననిపిస్తుంది.

'చిన్నాన్న'గారి ఇల్లు తేలికగానే దొరికింది. నేను వెళ్ళేసరికి రుక్మిణి ముందు ఆవరణలో దూడను కట్టేస్తున్నది.

నన్నామె వెంటనే గుర్తుపట్టక, కొంచెం సేపయాక, 'ఓహో, మీరా?' అన్నది.

'నేను రాసిన ఉత్తరం అందలేదా?' అన్నాను. నా సంభాషణ అంతా ఇదే విధంగా, చేతగానివాడు రాసిన నాటకంలో మోస్తరుగా సాగిందనుకో.

'ఏం ఉత్తరం?... ఓహో, కిందటేడు రాసిందా?'

అందిందన్నమాట!

'జవాబు రాకపోతే అందలేదేమో అనుకున్నాను' అన్నాను.

'జవాబా? అందులో జవాబుకేముందీ? నన్నేమన్నా అడిగారా?'

'లేదు... ఏమో...!... ఏం రాశానో నాకు గ్యాపకం లేదు.'

ఆ క్షణాన నిజంగానే నాకు జ్ఞాపకం లేదు.

దయలాగు మొండిపడింది. నేను వచ్చిన పని ఎట్లా చెప్పేది? ఆమె, ఆమె పక్కన దూడా! చుట్టూ పేడవాసనా!

ఒక నిమిషమో, అర నిమిషమో గడిచింది. కాని ఆ సమయంలో ప్రతి సెకండూ ఒక యుగం లాగా ఉన్నది. స్టేజి మీద ఎమెచూరు నటుడు పోర్షను మరిచిపోయినాక ఉంటుంది చూడూ! అదే మోస్తరు.

'ఏం పనిమీద వచ్చారు?' అని రుక్మిణి అడిగింది. 'ఎందుకలా నుంచున్నావూ, వెళ్ళిపోక?' అన్న మాటలు ఆమె గొంతులో స్పష్టంగా ధ్వనించాయి.

మంచి క్యూ దొరికింది. ఆత్రంగా, 'నీ కోసమే వచ్చా' అన్నాను.

'నా కోసమా?' అన్నది ఆశ్చర్యంగా.

ఎట్లా చెప్పానో అడగకు. ఆ కంగారులో ఏమన్నదీ నాకే తెలీదు. నన్ను పెళ్ళి చేసుకోరాదా అని అర్థం వచ్చేట్టు అడిగా.

దాంతో ఆటంబాంబు పేలింది. రుక్మిణి మహాకాళి అయిపోయింది. నాకు వావీ వరసా లేదా అని అడిగింది. స్నేహితుడి పెళ్ళాం చెల్లెలు కాదా అన్నది. ఇందుకేనా తన భర్త జబ్బుతో తీసుకుంటూ చావు బతుకుల్లో ఉండగా ఆదుకునే వాడల్లే వచ్చి, రూపాయలు విరజిమ్మింది అని అడిగింది. నా దుర్బుద్ధి గురించి తనకు మొదటి నుంచీ అనుమానంగానే ఉన్నదన్నది. బతికున్నంత కాలమూ తన మొగుడికి పెద్ద స్నేహితుడల్లే నటించి ఇప్పుడతనికి ద్రోహం చెయ్యటానికి ఒడిగట్టావన్నది.

ఇంక చెప్పటానికేముంది? అర్జునుడు బాణాలతో చావగొట్టుతుంటే యుద్ధ రంగం నుంచి పారిపోయే చిల్లర సైనికుడిలాగ వెన్నిచ్చి పారిపోయి వచ్చాను. నీకు ఇతరులు దుర్మార్గం అంటగట్టినప్పుడు, వారి అపోహలకు ఎంత బలహీనమైన ఆధారాలున్నా నీలో ఆ దుర్మార్గం ఉన్నంతగానూ బాధపడి తీరాలి. ఇంకా బాధ పడుతూనే ఉన్నాను. చచ్చేదాకా బాధ పడతాను. ఒకవేళ మరిచిపోయినా, ఏ కథో, ఏ పిక్చరో దాన్ని జ్ఞాపకం చేసి బాధిస్తుంది...

గిరి తన కథ ముగించాడు.

నేను చాలాసేపు ఆలోచించాను... గాయపడిన వాడి మనస్సును ఎట్లా సముదాయించాలా అని.

'చూడు గిరీ, తన భర్త ప్రేమను సంపాదించుకున్న ఏ ఆడదీ ఆ భర్త యొక్క ఆప్తమిత్రులను సహించలేదు. నువు మగవాడివి గనుక నీ స్నేహితుణ్ణి అతని భార్యతో పంచుకుందామనుకున్నావు. ఆవిడ తన భర్తను పిల్లలతో పంచుకోవటానికి కూడా ఒప్పుకోకపోవచ్చు - పిల్లలు లేరనుకో' అన్నాడు.

'ఎందుకు? ఎందుకు?' అని బాధగా అడిగాడు గిరి.

'ఎందుకంటే ఏమిటి చెప్పటం? నూటికి తొంభై మంది, ముప్పాతికమంది ఆడవాళ్ళు ప్రిమిటివ్‌గా ఉంటారు. దానికి నువేం చెయ్యగలవు? నేనేం చెయ్యగలను?' అన్నాను.

గిరి తల వంచుకుని ఆలోచిస్తూ ఏమీ మాట్లాడలేదు.

*ముద్రణ : ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 2 జూన్ 1967*